# గుట్టలో వైభవంగా సువర్ణ పుష్పార్చనలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఉత్సవమూర్తులకు సువర్ణ పుష్పార్చనలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణతంతు జరిపించారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో



లక్ష్మీనరసింహుల కల్యాణోత్సవ సేవ

భక్తులు పాల్గొని కల్యాణతంతును వీక్షించారు. సాయంత్రం వేళలో స్వామివారికి తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళలో స్వామివారి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చనలు చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అర్చకులు వేద మంత్రాలు పఠిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు చేశారు. గోదాదేవి శ్రీరంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు చేశారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.29,66,832 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. జనవరి 4న స్వామివారి హుండీలు లెక్కించనున్నట్లు తెలిపారు. స్వామి వారిని ప్రముఖ కవి అందెశ్రీ, భూదాన్ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, నాగారం జడ్పీటీసీ కడియం పరమేశ్వర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# సురేశ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 29 : తుంగతుర్తి నియోకవర్గం అర్వపల్లి మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మెండె సురేశ్, అతని భార్య, పిల్లలపై కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేశ్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వర్గానికి చెందిన నాయకుడని చూడకుండా రైతుబంధు రాలేదని అడుగుతావా? నీళ్లు రాలేదని వాట్సప్‌లో పెడుతావా? అంటూ దాడి చేయడం బాధాకరమన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఘర్షణలు, దౌర్జన్యాలు, రౌడీయిజానికి తావు లేకుండా పాలన సాగించినట్లు గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ నాయకులపై అకారణంగా దాడులు చేయడం తగదన్నారు. మరోసారి ఇలా జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పదేండ్ల కిందటి విష సంప్రదాయాన్ని మళ్లీ తెచ్చే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురేశ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ అర్వపల్లి మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, బొడ్డు రామలింగయ్య, గణేశ్ ఉన్నారు.



సురేశ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

# ప్రజాపాలన సభలను సద్వినియోగం చేసుకోవాలి

● ఒకే అప్లికేషన్‌తో అన్ని పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు
● ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్



ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తుదారుకు రసీదు అందిస్తున్న ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్, సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకాల దరఖాస్తుల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్ సూచించారు. ప్రజాపాలన సభల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేటలోని 3, 19, 20, 35, 36, 45వ వార్డుల్లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా 19వ వార్డులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని చోట్లా కేవలం ఐదారు కౌంటర్లు మాత్రమే పెట్టి దరఖాస్తులు స్వీకరిస్తుంటే, సూర్యాపేట జిల్లా కేంద్రంలో 8 నుంచి 9 కౌంటర్లు పెట్టి దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు ఒకే అప్లికేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్‌కార్డు లేకున్నప్పటికీ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా వార్డుల్లో సభ నిర్వహించిన రోజున ఎవరైనా అందుబాటులో లేకుంటే ఆ తర్వాత తమ దరఖాస్తులను స్థానిక అధికారులకు సమర్పించవచ్చన్నారు. అన్ని ప్రజాపాలన సభల్లో జనరల్ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేసి ప్రజల నుంచి సమస్యలపై కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ సురేశ్, మెప్మా పీడీ రమేశ్‌నాయక్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు గండూరి పావనీకృపాకర్, సుంకరి అరుణారమేశ్, ధీరావత్ రవి నాయక్, వార్డుల నాయకులు పాల్గొన్నారు.

## ఫణిగిరి కాకతీయుల రెండంతస్తుల మండపాన్ని కాపాడుకోవాలి

● పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

నాగారం, డిసెంబర్ 29 : సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధి ఫణిగిరి గ్రామ శివారులోని నరసింహాలయం ఎదుట శిథిలమవుతున్న రెండంతస్తుల మండపాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఆలయ పరిసరాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ రెండంతస్తుల మండపం క్రీస్తుశకం 13వ శతాబ్దికి చెందిన కాకతీయ వాస్తు శైలికి అద్దం పడుతుందని, చుట్టూ మట్టి పేరుకుపోయి మొదటి అంతస్తు సగం పూడి పోయిందని, రెండో అంతస్తుపైన ఉన్న విమానం పెచ్చులు ఊడి పోయాయని చెప్పారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి మండప భాగాలపై కొట్టిసున్నాన్ని తొలగించి చారిత్రక నిర్మాణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మండపాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

## ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీలు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 29 : 2022–23 విద్యా సంవత్సరం ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులకు జనవరిలో ఆన్‌లైన్ ద్వారా పోటీలను నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను జనవరి 1నుంచి 18వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు వారికి సంబంధించిన ప్రాజెక్టులను వీడియో, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో జనవరి 26నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 1నుంచి 3వరకు రాష్ట్ర స్థాయి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సైన్స్ అధికారి దేవరాజ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# ఎన్నికల ఖర్చు నివేదికల పరిశీలన

● నియోజకవర్గాల వారీగా పరిశీలించిన వ్యయ పరిశీలకులు

నల్లగొండ, డిసెంబర్ 29 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చు నివేదికలను ఎన్నికల వ్యయ పరిశీలకులు సతీశ్ గురుమూర్తి, డీఎం నిమ్జే, సంతోష్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎలక్షన్ వ్యయ బృందాలకు సంబంధించిన అధికారులతో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చులు, రీకన్సిలేషన్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల నివేదికలను సతీశ్ గురుమూర్తి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల నివేదికలను డీఎం నిమ్జే, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల నివేదికలను సంతోశ్ కుమార్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఎన్నికల ఖర్చులను పరిశీలిస్తున్న అధికారులు

# చలాన్ల రాయితీని వినియోగించుకోవాలి

● సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 29 : రాష్ట్రంలో రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారికి సంబంధించి పోలీస్ శాఖ వారు వాహనాలపై విధించిన పెండింగ్ చలాన్లపై రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ ప్రక్రియ డిసెంబర్ 26 నుంచి అమల్లోకి వచ్చిందని, ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకొని వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు, తోపుడుబండ్లపై 90 శాతం, ద్విచక్ర వాహనాలపై 80 శాతం, ఆటోలు, కార్లు, జీప్‌లు, ట్యాక్సీలపై 60 శాతం, భారీ వాహనాలపై 50 శాతం రాయితీ ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలో 25వ తేదీ వరకు 6,08,968 ఈ–చలాన్ కేసులు పెండింగ్ ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో గత మూడ్రోజులుగా 30,600 ఈ–చలాన్ కేసులను పరిష్కరించుకున్నారని, ఇందుకుగానూ ప్రభుత్వానికి రూ.31.65 లక్షలు వచ్చినట్లు తెలిపారు.

## సఖితో సత్వర న్యాయం

నల్లగొండ, డిసెంబర్ 29: జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ మహిళా, శిశు, వికలాంగుల వృద్ధుల ఆధ్వర్యంలో బాలికల మహిళల లైంగిక వేధింపులపై బాలల పరిరక్షణ విభాగం, పోలీస్ శాఖ, సఖి సిబ్బందితో శుక్రవారం సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ గృహ హింస చట్టం కేసులు, ఫోక్సో కేసులు, మహిళలు, బాలికలకు సం బంధించిన ఏ విధమైన కేసులు వచ్చినా అన్ని శాఖల సమన్వయంతో ఒకే చోట సత్వర న్యాయం జరిగేలాగా కలిసి త్వరగా పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. ఇందుకు అనుగుణంగా కలిసి పనిచేయడంతో బాధితులకు నమ్మకాన్ని పెంపొందించడం కోసం కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల రక్ష కోఆర్డినేటర్ హరిత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి గణేశ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణ, పోలీస్ సిబ్బంది, సఖి కౌన్సిలర్ నాగమణి పాల్గొన్నారు.